సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 5 । మే । 2025



సరదా వెంట విషాదం
పిల్లలు చేసే కొన్ని పనులు వారి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. సరదాగా ఈతకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.
8లో



కమ్ముకుంటున్న చీకట్లు!
చిన్నప్పటి నుంచి అందరితో పాటు ఎంతో ఉల్లాసంగా ఆటపాటలతో గడిపింది. పదో తరగతి చదువుతుండగా ఒక్కసారిగా కంటి చూపు మందగించింది.
8లో

గరిష్టం/కనిష్టం
40.2°/22.8°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక '



ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..
పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఎస్పీ వి. రత్న ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పనిసరిగా వెంట తీసుకొని రావాలన్నారు.

16న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి చర్చను ప్రారంభిస్తారన్నారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలపై చేపట్టిన చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. అధికారులు గైర్హాజరు కావొద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా శ్రీసత్యసాయి జిల్లా అధికారులు కచ్చితంగా హాజరు కావాలని సూచించారు.

అక్రమాలు నిజమే

- రెడ్డప్పశెట్టికి నోటీస్ జారీ చేసిన ఏపీఐఐసీ



లేపాక్షి హబ్ భూమిలో ఉన్న ఫారం పాండ్‌ను పరిశీలిస్తున్న ఏపీఐఐసీ జెడ్‌ఎం సోనీ

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: మండల పరిధిలోని కోడూరులో ఉన్న లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూముల్లో రియల్టర్ రెడ్డప్పశెట్టి అక్రమంగా పాలీ హౌస్, ఫారం పాండ్ల నిర్మాణాలు చేపట్టినట్లు ఏపీఐఐసీ అధికారులు ధ్రువీకరించారు. ''అక్రమాలు కోకొల్లలు'' శీర్షికన ఏప్రిల్ 28న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఏపీఐఐసీ జెడ్‌ఎం సోనీ ఈ నెల 1న రెడ్డప్పశెట్టి ఎస్టేట్‌ను తనిఖీ చేశారు. ఈడీ అటాచ్‌మెంట్ భూముల్లో ఫారంపాండ్, ఒక గది, పాలీహౌస్, విద్యుత్ కనెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. కోడూరు పొలం సర్వే నంబర్ 679లో ఈడీ అటాచ్‌మెంట్ భూమిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని జెడ్‌ఎం సోనీ తెలిపారు. హబ్ భూములకు రెడ్డప్పశెట్టి సబ్సిడీలు ఎలా పొందారో హార్టికల్చర్ వాళ్లే సమాధానం చెప్పాలన్నారు. లేపాక్షి హబ్ భూమిలో ఉన్న ఫారం పాండ్‌లోని మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో కూడా ఆశ్చర్యంగా ఉందన్నారు. ఏడు రోజుల్లోగా ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ చేశామన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు.

పేదల రక్తంతో వ్యాపారం

- జిల్లాలో రెచ్చిపోతున్న వడ్డీ జలగలు
- వారానికి రూ.10 చొప్పున వసూలు
- ఎక్కువ శాతం చేనేతలు, రైతులు, కూలీలే టార్గెట్
- వేధింపులు తాళలేక ఊళ్లు వదులుతున్న వైనం
- ఆత్మహత్యలకూ పాల్పడుతున్న బాధితులు



☞ బత్తలపల్లి మండలం కోడేకండ్లకు చెందిన రైతు కురుబ మల్లేష్ కొద్దిరోజుల క్రితం వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పంటలు చేతికందక వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులకు వడ్డీలకు వడ్డీ పెరిగి అసలును మించిపోవడంతో వారి వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంటి పెద్ద మరణంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది.

☞ ధర్మవరం పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన ఓ చేనేత కుటుంబం వడ్డీ వ్యాపారుల వద్ద వారానికి రూ.10 వడ్డీతో రూ.లక్ష అప్పు చేసింది. అప్పు తీర్చమని వడ్డీ వ్యాపారులు వేధిస్తుండటంతో ఊరు వదిలారు. బతుకు బండి సాగేందుకు ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసి కష్టాలు కొని తెచ్చుకున్నారు.

☞ కొత్తచెరువుకు చెందిన ఓ ఉద్యోగి ఐపీఎల్ బెట్టింగ్ మాయలో పడి వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేశాడు. తీర్చే మార్గం లేకపోవడంతో వడ్డీ వ్యాపారులు సదరు ఉద్యోగి ఇంటి వద్దకు వెళ్లి అప్పు ఇచ్చే వరకూ వదిలిపెట్టమని చెప్పడంతో చేసేదిలేక తనకు ఉన్న సొంతింటిని తక్కువ ధరకే విక్రయించి అప్పు తీర్చాడు.

ధర్మవరం: జిల్లాలో వడ్డీ వ్యాపారుల వేధింపులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అమాయకులైన ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అప్పు ఇవ్వడం.. వడ్డీ చెల్లించకుంటే వేధించి మరీ వసూలు చేయడం పరిపాటిగా మారుతోంది. దీంతో ఏం చేయాలో దిక్కు తోచక చాలా మంది ఊళ్లు వదులుతున్నారు. కొందరైతే జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేదాకా వెళ్తున్నారు.

ప్రభుత్వ సాయం లేక..
జిల్లాలోనే ధర్మవరం నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో చేనేత కార్మికులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలో సంక్షేమం కింద పైసా విడుదల చేయకపోవడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దీనికితోడు బతుకు బండి లాగేందుకు రేయింబవళ్లూ చేనేత మగ్గం నేసినప్పటికీ రోజు కూలి కూడా రావడం లేదు. రెండింతలు పెరిగిన ముడిపట్టు (వార్పు, రేషం) ధరలతో గిట్టుబాటు కావడం లేదు. చేసేది లేక అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. మరోవైపు రైతులు, కూలీల పరిస్థితి కూడా ఇదే రీతిలో ఉంది.

పేదల అవసరమే ఆసరా
పేద ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని వడ్డీ వ్యాపారులు వారానికి, నెలకు నూటికి రూ.10 చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నారు. వడ్డీ సకాలంలో చెల్లించకుంటే ఇంటి వద్దకు వెళ్లి వేధింపులకు పాల్పడుతున్నారు. ధర్మవరంలోని ఎల్‌సీకే పురంలో అయితే కొందరు వడ్డీ వ్యాపారులు అప్పు చెల్లించకుంటే వారి ఇంట్లో పడుకోవడం, పందులను వదలడం, భౌతిక దాడులకు దిగడం వంటి వాటికి పాల్పడుతున్నారు. వారి వేధింపులు తాళలేక ఇళ్లు వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లే వారు కొందరైతే, ఆత్మహత్య చేసుకుంటున్న వారు మరికొందరు. ఒక్క ధర్మవరం నియోజకవర్గంలోనే ప్రతినెలా పదుల సంఖ్యలో కుటుంబాలు వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక కేరళ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ కూలి పనులు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ కావడంతో యువత ఎక్కువగా బెట్టింగ్‌లకు పాల్పడి అధిక వడ్డీలకు అప్పులు చేసి తల్లిదండ్రులకు ఎనలేని వ్యథను మిగిల్చుతున్నారు.

వడ్డీ వ్యాపారులకు పోలీసుల అండ !
నియోజకవర్గంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. కొంత మంది కిందిస్థాయి పోలీస్ సిబ్బంది వడ్డీ వ్యాపారులకు అండగా నిలుస్తుండటంతోనే ఈ దందా యథేచ్ఛగా జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి. బాధితులు ఎవరైనా పోలీసులకు చెబితే వేధింపులు మరింత ఎక్కువ అవుతున్నాయని అంటున్నారు. వడ్డీ దందాపై డీఎస్పీ హేమంత్‌కుమార్ వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలోని శమీనారాయణస్వామి ఆలయంలో సాంప్రదాయబద్ధంగా గరుడ చిత్రపటానికి పూజలు నిర్వహించి మేళతాళాలతో ఊరేగింపుగా లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ధ్వజారోహణను అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్, చక్రధర్‌లు వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఉభయ దాతలుగా గజనాణ్యం పట్టుసాలే సంఘం ప్రతినిధులు వ్యవహరించారు. అనంతరం లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను పూల పల్లకీపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సూర్య, చంద్రప్రభ వాహన సేవ
లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాల్లో స్వామి వారిని ఊరేగించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



పల్లకీపై లక్ష్మీ చెన్నకేశవస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

వైఎస్సార్ స్మారక స్థూపం తొలగింపు



రెహమత్‌పురం సర్కిల్‌లో బైఠాయించిన వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, పార్టీ శ్రేణులు

- హిందూపురంలో అధికారుల అత్యుత్సాహం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల తీవ్ర నిరసన



వైఎస్సార్ స్మారక స్థూపం

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ, పట్టణంలోని రెహమత్‌పురం సర్కిల్లో ఉన్న ప్రజానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక స్థూపాన్ని శనివారం రాత్రి తొలగించారు. సెంట్రల్ లైటింగ్ పేరుతో ఈ చర్యకు ఒడిగట్టారు. అయితే వైఎస్సార్‌సీపీ శ్రేణుల తీవ్ర నిరసనల నేపథ్యంలో ప్రజానేత స్మారక స్థూపాన్ని తిరిగి యథాస్థానంలో ఉంచుతామని హామీ ఇచ్చారు. స్మారక స్థూపం తొలగింపు విషయం తెలుసుకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఆదివారం ఉదయం పార్టీ నియోజకవర్గ నేత వేణురెడ్డి ఆధ్వర్యంలో రెహమత్‌పురం సర్కిల్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. పార్టీ నేతలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే రాత్రికి రాత్రి స్మారక స్థూపాన్ని ఎలా తొలగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ఎమ్మెల్యే బాలకృష్ణకు, మున్సిపల్ చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. నేతలంతా ప్రతిఘటించారు. దీనితో చేసేదిలేక మునిసిపల్ అధికారులను పిలిపించి మాట్లాడించారు. చివరకు స్థూపాన్ని యథాస్థానంలో ఉంచుతామని హామీ ఇచ్చారు. దీనితో పార్టీ శ్రేణులు ఆందోళన విరమించాయి. కార్యక్రమంలో పార్టీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌పీ శివ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఆసిఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీఉల్లా తదితర నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. టీడీపీ నేతలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఆనవాళ్లను చెరిపేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వేణురెడ్డి ఈ సందర్భంగా మండిపడ్డారు. దివంగత నేత హిందూపురానికి శ్రీరామరెడ్డి పథకం ద్వారా తాగునీరు ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన సేవలకు గుర్తుగా ఏర్పాటు చేసుకున్న స్థూపాన్ని ఎలా తొలగిస్తారని మండిపడ్డారు.



వైఎస్సార్ స్మారక స్థూపాన్ని తొలగించిన దృశ్యం

పోలీసులు చట్ట ప్రకారం పనిచేయాలి



బెయిల్‌పై విడుదలైన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయపెట్టాలని చూస్తే బెదిరేదిలేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

ధర్మవరం అర్బన్: పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయకుండా చట్ట ప్రకారం పని చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హితవు పలికారు. వైఎస్సార్‌సీపీకి చెందిన పది మంది నాయకులపై అక్రమ కేసులు బనాయించినా వారికి కోర్టులో బెయిల్ రావడంతో న్యాయం, ధర్మం గెలిచాయని హర్షం వ్యక్తం చేశారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఆదివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మవరం కోర్టును ఆశ్రయించగా ఆదివారం రాత్రి పది మందికి జడ్జి బెయిల్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా విడుదలైన వారితో కలసి ఉషశ్రీచరణ్ విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయిస్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అండతో వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయపెట్టాలని చూస్తే బెదిరేది లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని ప్రజలకు తెలిసిపోయిందని పేర్కొన్నారు.


అదృష్టం వరించేనా?



వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్న ప్రజలు



చెట్ల కింద ఉంచిన ద్విచక్ర వాహనాలు



- చిగిచెర్ల పొలాల్లో వజ్రాల కోసం జోరుగా అన్వేషణ

ధర్మవరం రూరల్: వర్షం వచ్చిందంటే చాలు ధర్మవరం మండలం చిగిచెర్ల సమీపంలోని పంట పొలాలు జనాలతో కనిపిస్తుంటాయి. వజ్రాలు దొరుకుతాయన్న నమ్మకంతో ఎంతో మంది చేతిలో భూతద్దం , ఇతర పరికరాలు చేతపట్టుకొని క్యారియర్లతో ఇక్కడికొచ్చేస్తుంటారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ వజ్రాన్వేషణలో మునిగిపోతున్నారు. ప్రతి రాయినీ నిశితంగా పరిశీలిస్తూ.. కాంతి వంతమైన రాయి కనిపిస్తే చాలు అది వజ్రమేనన్న ఆనందంలో కేరింతలు కొడుతుంటారు. అది వజ్రం కాదు .. సాధారణ రాయేనని చర్చించుకోవడం, తిరిగి ఆశతో అన్వేషణ కొనసాగించడం పరిపాటిగా మారింది. ఇప్పటి దాకా వజ్రాలు దొరికాయన్న ఊహాగానాలు తప్ప అవి ఎంత వరకూ నిజమో ఎవరికీ తెలీదు.

వర్షం వచ్చిందంటే చాలు..



వర్షం వచ్చిందంటే చాలు మా గ్రామ పొలాల వద్దకు వజ్రాల అన్వేషణ కోసం గుంపులుగా ప్రజలు వస్తుంటారు. స్థానికులే కాదు పట్టణాల నుంచి వాహనాల్లో క్యారియర్లు కట్టుకొని వస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లోనే తిరుగుతూ మట్టి కింద కట్టె పుల్లలతో గెదిరిస్తుంటారు. వజ్రాలు దొరుకుతాయో లేదోగాని ఎవరి అడ్రస్సు పూర్తిగా కూడా చెప్పరు.
– మాధవయ్య, చిగిచెర్ల

వజ్రాలు దొరుకుతాయని నమ్మకం



చిగిచెర్ల ప్రాంతంలో వజ్రాలు దొరుకుతాయనే నమ్మకంతో ఎక్కడెక్కడ నుంచో ఇక్కడికి వస్తుంటారు. గతంలో ఈ ప్రాంతంలో వజ్రాల కోసం ప్రభుత్వం పలు పరిశోధనలు చేసినట్లు ఇక్కడ ఆధారాలు ఉన్నాయి. పెద్దలు కూడా చిగిచెర్ల పొలాల్లో వజ్రాలు దొరుకుతాయని చెబుతుంటారు. వజ్రాలు ఎవరికి దొరుకుతాయో ఏమో తెలీదు. వర్షాలు వచ్చినప్పుడు మాత్రం చిగిచెర్ల పొలాలు జనంతో కిటకిటలాడుతుంటాయి. – కొంకా గాంధీ, వసంతపురం

ప్రశాంతంగా 'నీట్'



అనంతపురం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల హడావుడి



విద్యార్థుల హాల్ టికెట్ చూసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న అధికారులు

అనంతపురం: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్-యూజీ 2025) ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆరు పరీక్ష కేంద్రాలు (అనంతపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాయ్స్), ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్కేయూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, జేఎన్‌టీయూ-ఏ ఇంజినీరింగ్ కళాశాల, కేఎస్ఎన్ ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల, ఏపీ మోడల్ జూనియర్ కళాశాల- గుత్తి) ఏర్పాటు చేశారు. 2,613 మందికి గాను, 2,534 మంది (96.97 శాతం) హాజరయ్యారు. 79 మంది గైర్హాజరయ్యారు.

తల్లిదండ్రులకు తప్పని ఇక్కట్లు..
నీట్ రాయడానికి అభ్యర్థులతో పాటు వచ్చిన తల్లిదండ్రులకు ఇక్కట్లు తప్పలేదు. ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రం ఎస్కేయూ ప్రధాన ద్వారానికి చాలా దూరంగా ఉంటుంది. తల్లిదండ్రులు అందరినీ ప్రధాన ద్వారం వద్దే ఆపేశారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్దే ఆపివేయడంతో తల్లిదండ్రులు మండుటెండల్లో రోడ్డుపైనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎస్కేయూ ఉద్యోగుల క్వార్టర్స్‌లో ఉండే ప్రొఫెసర్లు వారికి మంచినీరు ఇచ్చి దాహం తీర్చారు. అతి పెద్ద క్యాంపస్ అయిన ఎస్కేయూ లోపలికి తల్లిదండ్రులను కూడా అనుమతించి ఉంటే క్యాంటీన్ వద్దో.. ఇతరత్రా భవనాల వద్ద కూర్చుని ఉండేవారు. ఉదయం 11 గంటలకు లోపలికి వెళ్లిన అభ్యర్థులు సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రులు బయటే మండుటెండలో వేచి ఉన్నారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న లారీ



లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను కాపాడుతున్న స్థానికులు

రొద్దం: మండలంలోని తురకలాపట్నం వద్ద ప్రధాన రహదారిపై చింత చెట్టును లారీ ఢీకొంది. వివరాలు.. ఆదివారం ఉదయం పావగడ వైపు నుంచి పెనుకొండకు వెళుతున్న లారీ తురకలాపట్నం వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో గోవిందరెడ్డి ఇంటి వద్ద ఉన్న చింత చెట్టుని బలంగా ఢీకొంది. లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న హోంగార్డు బాలరాజుతో పాటు డ్రైవర్ పనసంద్రం నరసింహమూర్తి ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నరేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో దాదాపు 3 గంటల పాటు శ్రమించి డ్రైవర్, హోంగార్డును వెలికి తీశారు. హోంగార్డుకు చెయ్యి విరిగింది. క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను 108 వాహనంలో పెనుకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీ - వ్యక్తి మృతి



మృతుడు భాస్కర్

హిందూపురం: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమందేపల్లి మండలం చెన్నాపురం గ్రామానికి చెందిన భాస్కర్ (35) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళుతుండగా హిందూపురం మండలం మణేసముద్రం వద్ద ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు తీవ్రం గాయపడ్డారు. ఘటనపై హిందూపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని అమ్మవారిపేట గ్రామంలో కుక్కల దాడిలో 85 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు సిద్దప్ప, రామలింగ ఆదివారం అదే గ్రామ శివారులో కంచె ఏర్పాటు చేసి గొర్రె పిల్లలను అందులో ఉంచి పెద్ద గొర్రెలను మేపునకు తీసుకెళ్లారు. ఆ సమయంలో కుక్కలు చొరబడి 85 గొర్రె పిల్లలను కొరికి చంపేశాయి. దీంతో రూ.6 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

సరదా వెంట విషాదం



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన అశ్విన్ ఆరాధ్య (ఫైల్)

హిందూపురం మున్సిపాల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన అశ్విన్ ఆరాధ్య (11)... వేసవి సెలవులు కావడంతో ఇంటి సమీపంలోనే మిత్రులతో కలిసి పాఠశాల వద్ద క్రికెట్ ఆడుతున్నాడు. ఈ నేపథ్యంలో పాఠశాల భవనంపై పడిన బంతిని తీసుకు వచ్చేందుకు పైకి ఎక్కిన బాలుడు అక్కడే ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కుప్పకూలాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటన జరిగి మూడు రోజులైంది.

కదిరి నియోజకవర్గం నంబూలపూలకుంట మండలంలోని వెలిచెలమలలో 14 ఏళ్ల బాలుడు రూపేష్ వేసవి సెలవులు కావడంతో బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ పిల్లలతో కలిసి సమీపంలోని బావి వద్దకు సరదా ఈతకు వెళ్లాడు. బావిలోకి దూకిన అతడు ఎంతసేపటికి బయటకు రావడంతో అక్కడ ఉన్న వారు బావిలో పిల్లాడిని వెతికి బయటకు తీసుకువచ్చారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందాడు.



బావిలో ఈతకెళ్లి మృతి చెందిన రూపేష్ (ఫైల్)

... ఈ రెండు ఘటనలే కాదు... వేసవి సెలవులు ప్రారంభమైనప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఎక్కడో ఓ చోట పిల్లలు ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. వీరిలో కొందరు ప్రాణాలతో బయటపడగా... మరికొందరు అకాల మృతితో కన్నవారికి కడుపుకోత మిగిలిస్తున్నారు.

- ఆటలు.. ఈత అంటూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్న పిల్లలు
- వేసవి సెలవుల్లో పిల్లలపై నిఘా ఉంచాలంటున్న నిపుణులు

హిందూపురం టౌన్: సెలవులు వచ్చాయంటే పిల్లల అల్లరికి పరిమితులు అంటూ ఉండవు. సెలవుల్లో పిల్లలను అదుపు చేయడం ఒక విధంగా తల్లిదండ్రులకు కత్తి మీద సామే అవుతోంది. వేసవి తాపాన్ని తట్టుకోలేక ఈతకెళదామంటూ గొడవ చేయడం, టిఫిన్, భోజనం తదితరాలను పక్కన పెట్టి గంటల తరబడి ఎండలోనే ఆడుకోవడం పరిపాటిగా మారింది. అయితే సరదాగా అనుకుని పిల్లలు చేసే కొన్ని పనులు చివరకు వారి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఈతకు వెళ్లే సమయంలో లోతు, నేల స్వభావం తెలియక నీటిలోకి దిగి ప్రమాదం బారిన పడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల్లో మండుటెండలోనే ఎక్కువ సేపు ఆడుకుంటూ వడదెబ్బకు గురవుతున్నారు. చివరకు ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక ప్రాణాలు కోల్పోతున్న వారి ఉదంతాలూ ఉన్నాయి. ఇలాంటి ఘటనలతో పిల్లలపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల గుండెలు తరుక్కుపోతున్నాయి.

నిఘా అవసరం

వేసవి సెలవుల్లో పిల్లల కదలికలపై తల్లిదండ్రులు తప్పక నిఘా ఉంచాలి. సెలవుల్లో సరదాగా గడపడం అందరికీ ఇష్టమే కానీ, దానిని విషాదంతో ముగియకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లలు ఎక్కడ తిరుగుతున్నారు అనే విషయంపై దృష్టి పెడితే ప్రమాదాలను నివారించవచ్చు. ఈతకు బావులు, చెరువుల వద్దకు వెళ్లే సమయంలో ఇంటి పెద్దలు తప్పనిసరిగా వెంట ఉండాలి. పెద్దల సమక్షంలోనే ఈత నేర్చుకునేలా చూసుకోవాలి. ఎండలో కాకుండా నీడ పట్టునే ఆడుకునే ఆటలపై మక్కువ పెంచేలా చూడాలి. విద్యుత్ తీగల వద్దకు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళితే కలిగే అనర్థాలు, ప్రమాదాలపై అవగాహన కల్పించాలి.

నైపుణ్యాల మెరుగుకు ఇదో అవకాశం



పిల్లల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వేసవి సెలవులు ఎంతో దోహదపడతాయి. పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ, బాధ్యత వహించాలి. గ్రంథాలయాల్లో జరిగే వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పిల్లలను బయటకు పంపకుండా ఇంట్లోనే నీడ పట్టున ఆడుకునేందుకు అవకాశం కల్పించాలి. సెలవుల్లో కొత్త విషయాలను నేర్పించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలి.

– గంగప్ప, ఎంఈఓ, హిందూపురం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు



ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడుకు బాబా చిత్రపటాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

పుట్టపర్తి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. తొలిసారి పుట్టపర్తికి విచ్చేసిన ఆయన స్థానిక ఓ హోటల్‌లో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి, దామోదరరెడ్డి, సుధామణి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ఆపాస్ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులతో ఆదివారం సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి ఇప్పటికే సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్చించినట్లు తెలిపారు. పాత బకాయిలతో పాటు మెరుగైన ఐఆర్, పీఆర్సీ అందించాలని కోరామన్నారు. వేసవిలో క్లాసులు బోధించే టీచర్లకు ఈఎల్ మంజూరు చేయాలన్నారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రశ్న పత్రాలు జిల్లాల వారీగా కాకుండా రాష్ట్రం మొత్తం ఒక్కటే ఉండేలా చూడాలని సూచించారు. తరగతి గదిలో 40 మంది విద్యార్థులు ఉండేలాచూడాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు టీచర్లను నియమించాలని కోరామన్నారు. విడతల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం భరోసానిచ్చినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తలమర్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

డ్రిప్ టార్గెట్ 14 వేల హెక్టార్లు

- ఇంకా ఏపీఎంఐపీకి అందని గ్రీన్‌సిగ్నల్

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది శ్రీసత్యసాయి జిల్లాకు డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్ 14 వేల హెక్టార్లు ఇచ్చినట్లు ఏపీఎంఐపీ వర్గాలు తెలిపాయి. అయితే నియమ నిబంధనలు ప్రకటించలేదన్నారు. ఈ ఏడాది 5 ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ వర్గాల రైతులకు 100 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నట్లు సమాచారం. అలాగే 10 ఎకరాల్లోపు ఉన్న ఇతర రైతులకు 90 శాతం రాయితీని వర్తింపజేయనున్నట్లు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు ఏపీఎంఐపీకి అందకపోవడంతో ఎలాంటి ప్రకటన జారీ చేయకుడా మిన్నకుండిపోతున్నారు. ప్రస్తుతం గతేడాది అర్హులైన రైతుల్లో ఇంకా చాలా మందికి మెటీరియల్ సరఫరా చేస్తూ ఉన్నారు.

పచ్చ మీడియా కుట్రలను తిప్పికొడదాం

- బ్రిస్బేన్‌లో వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అవాస్తవాలను ప్రచారం చేస్తూ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తూ ప్రజలను వంచనకు గురి చేస్తున్న పచ్చ మీడియా కుట్రలను తిప్పికొడదామంటూ ప్రవాసాంధ్రులకు వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ గ్లోబల్ కనెక్ట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆకాంక్షలతో కూడిన చర్చ జరిగింది. ప్రవాసాంధ్రులు భావోద్వేగంతో వైఎస్సార్‌సీపీ పట్ల తమకున్న అభిమానాన్ని చాటారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సాగించిన 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజల బాధలు, వారి అవసరాలను తెలుసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయగానే అన్నింటినీ నెరవేర్చారని గుర్తు చేశారు. మేనిఫెస్టోను ఓ కాగితంగా కాకుండా ప్రజా ఒప్పందంగా నిరూపించారన్నారు. రూ.4.47 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఆర్థికాభివృద్ధిలో భాగంగా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులను, 90కి పైగా మౌలిక ప్రాజెక్ట్‌లను తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లోనే రాష్ట్రంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ సంక్షేమ పథకాలకు తిలోదకాలు ఇచ్చేసిందన్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లోకి వ్యతిరేకత మొదలైందన్నారు. ఇలాంటి తరుణంలో ప్రజలకు అండగా నిలబడేందుకు అందరూ సామాజిక మాధ్యమాల ద్వారా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జగనన్న చేసిన మేలును గణాంకాలతోనే తెలియజేస్తూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, క్వీన్స్‌ల్యాండ్ కన్వీనర్ బ్రహ్మారెడ్డి, పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం



ఈశ్వరమ్మ (ఫైల్)

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామానికి చెందిన చిరంజీవి భార్య ఈశ్వరమ్మ (28) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రంగచేడుకు చెందిన ఆంజనేయులు, గంగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులతో పాటు కుమార్తె ఈశ్వరమ్మ ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగించేవారు. పదేళ్ల క్రితం రాయదుర్గం మండలం కెంచానపల్లి గ్రామానికి చెందిన చిరంజీవికి ఈశ్వరమ్మను ఇచ్చి వివాహం చేశారు. చిరంజీవి జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పెళ్లి తర్వాత చిరంజీవి ఇల్లరికం వచ్చాడు. వీరికి ఓ కుమార్తె ఉంది. గత రెండేళ్లుగా ఈశ్వరమ్మ తరచూ కడుపునొప్పితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించిన నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత దుర్మరణం



మున్నీ మృతదేహం

చెన్నేకొత్తపల్లి: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం సజ్జలకాలువకు చెందిన వివాహిత మున్నీ(30), తన దూరపు బంధువు హుస్సేన్‌బాషాతో కలసి పెనుకొండలోని దర్గాకు వచ్చారు. దర్శనం అనంతరం ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు చెన్నేకొత్తపల్లి మండలం యర్రంపల్లి - దామాజిపల్లి గ్రామాల మధ్య 44వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వేగంగా దూసుకొచ్చిన కారు వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో మున్నీ అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన హుస్సేన్‌బాషాను స్థానికులు చెన్నేకొత్తపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, మున్నీకు భర్త ఇజాజ్, ఓ కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గొర్రెల వ్యాపారిని బెదిరించి రూ.6.80 లక్షల అపహరణ



బాధితుడు నారాయణస్వామి

బుక్కరాయసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి పరిధిలో గొర్రెల వ్యాపారిని దుండగులు అటకాయించి నగదు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్‌కు చెందిన నారాయణస్వామి గొర్రెల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం అనంతపురం మార్కెట్ యార్డులో గొర్రెలు విక్రయించగా వచ్చిన డబ్బుతో అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో గొర్రెలు కొనుగోలు చేసేందుకు తన స్కూటీ వాహనంపై బయలుదేరాడు. దేవరకొండ - ఉప్పరపల్లి మధ్యలో ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు వ్యక్తులు ముఖానికి మాస్క్ వేసుకుని నారాయణస్వామిని అడ్డుకున్నారు. డబ్బు ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించి, అతని వద్ద ఉన్న రూ.6.80 లక్షలు లాక్కొని ఉడాయించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

గార్లదిన్నె: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గార్లదిన్నె పీఎస్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెంకటేషులు వెల్లడించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన రాజశేఖర్, శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు క్రికెట్ బెట్టింగ్‌ల వైపు మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఆదివారం పలువురిని ఆకట్టుకుని ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐలు గౌస్ మహమ్మద్ బాషా (గార్లదిన్నె), విజయ్‌కుమార్ (శింగనమల) కల్లూరులోని రాజశేఖర్ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రాజశేఖర్‌తో పాటు సుధీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి పట్టుపడ్డారు. వీరి నుంచి రూ.4,02,000 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఖజానా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక




ఎన్నికల అధికారులు, పరిశీలకులతో ఖజానా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం (ఏపీటీఎస్ఏ) కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిసాయి. స్థానిక ట్రెజరీ హోమ్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియకు ఎన్నికల అధికారులుగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు పి.కిరణ్‌కుమార్ (నెల్లూరు), డి.రవికుమార్(కర్నూలు), ఎన్నికల పరిశీలకులుగా ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్ వ్యవహరించారు. కార్యవర్గంలోని అన్ని స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలు కావడంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రటించారు. ఎన్నికైన సభ్యులకు ప్రొసీడింగ్స్ అందజేశారు.

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ఉమ్మడి జిల్లా ఖజానా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పి.శంకర నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ఫారూక్ మహమ్మద్, కార్యదర్శిగా జి.మహేశ్వరెడ్డి, కోశాధికారిగా బి.అనంతయ్య ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పి.సుమనలత, జి.జగదీష్, ఎం.శ్రీనివాసరావు, కె.వాసుమూర్తియాదవ్, సంయుక్త కార్యదర్శులుగా పి.సిద్దిక్‌ఖానుమ్, డి.శ్రీనివాసులు, ఎం.కె.రాజేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సి.తిరుమలరెడ్డి, సి.కిషోర్‌కుమార్‌చౌదరి, జి.ఉమేష్ ఎన్నికయ్యారు.

11,12న 'వజ్రగిరి' బ్రహ్మోత్సవాలు



వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం

పెద్దపప్పూరు: మండలంలోని తిమ్మన చెరువు గ్రామ సమీపంలోని వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11,12న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 11న స్వాముల వారి ఉత్సవమూర్తులను తిమ్మనచెరువు గ్రామం నుంచి కొండపైకి మేళతాళాలతో ఊరేగించుకుంటూ తీసుకెళ్తారు.అదే రోజు రాత్రి హైదరాబాద్ పట్టణానికి చెందిన సంగీత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.12 తెల్లవారుజామున తిరుపతికి చెందిన వేదమురళి క్రిష్ణమాచారి (సామవేద పండితుడు) వారి శిష్యబృందంచే హోమం, శ్రీవారి కల్యాణోత్సవం జరగనుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. తిమ్మనచెరువు, జూటూర గ్రామస్తులు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

కమ్ముకుంటున్న చీకట్లు!

చిన్నప్పటి నుంచి అందరితో పాటు ఎంతో ఉల్లాసంగా ఆటపాటలతో గడిపింది. 8వ తరగతి చదువుతుండగా ఒక్కసారిగా కంటి చూపు మందగించింది. ఏమి జరిగిందో ఏమో తెలుసుకునేలోపు ఓ కన్ను పూర్తిగా కనపడకుండా పోయింది. మరో కన్ను సైతం మసకబారింది. శస్త్ర చికిత్స చేస్తే కంటి చూపు వస్తుందని, లేకపోతే శాశ్వతంగా కంటి చూపు దూరమవుతుందని వైద్యులు నిర్ధారించారు. విషయం విన్న వెంటనే నిరుపేద తల్లిదండ్రులకు దిక్కు తోచలేదు. కుమార్తెకు కంటి చూపు ప్రసాదించే ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు.

- పట్టుమని 15 ఏళ్లకే కంటి చూపు దూరం
- ఆపరేషన్ చేస్తే ఫలితం ఉంటుందన్న వైద్యులు
- శస్త్రచికిత్సకు రూ.2 లక్షలు అవసరం
- చేతిలో చిల్లిగవ్వ లేక విలవిల్లాడుతున్న నిరుపేద కుటుంబం
- దాతలు సాయం చేయాలని వేడుకోలు



కుటుంబ సభ్యుల సహకారంతో నడుస్తున్న రేష్మిత

నల్లచెరువు: మండలంలోని ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన ప్రభాకరరెడ్డి, అమరావతి దంపతులకు కుమార్తె రేష్మిత, కుమారుడు పునీత్‌రెడ్డి ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చిన్నప్పటి నుంచి చదువులో ఎంతో చలాకీగా ఉండే రేష్మిత స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుండి పదో తరగతి వరకు చదువుకుంది.

బోర్డుపై అక్షరాలు కనిపించక..

ఎనిమిదో తరగతిలోకి వచ్చేసరికి కంటి చూపు సక్రమంగా లేదని రేష్మిత గుర్తించింది. ఇదే విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపితే వారు స్థానికంగా ఉన్న డాక్టర్ల వద్ద చికిత్స చేయించారు. అయినా ఫలితం అంతంత మాత్రమే. ఈ క్రమంలో కొన్ని నెలల వ్యవధిలోనే బోర్డుపై అక్షరాలు కనిపించక ఇబ్బంది పడుతూ వచ్చింది. మరి కొన్నిరోజుల్లోనే ఓ కన్ను పూర్తిగా కనిపించకుండా పోయింది. మసకబారుతున్న మరో కంటితోనే అతి కష్టం మీద చదవడం.. దినచర్యను కొనసాగిస్తూ వచ్చింది. ఏడాది క్రితం నడుచుకుంటూ వెళ్లే సమయంలో రహదారి సక్రమంగా కనిపించక అదుపు తప్పి కిందపడడంతో తొడ భాగంలోని ఎముక విరిగి పొట్టలో గుచ్చుకుంది. తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పిస్తే.. ఆరోగ్యశ్రీ వర్తించలేదు. అప్పటికప్పుడు తెలిసిన వారి వద్ద అప్పు చేసి రూ.2 లక్షల ఖర్చుతో ఆపరేషన్ చేయించారు. అయితే ఇప్పటికీ పూర్తిస్థాయిలో నడవలేకపోతోంది. తాను కంటి చూపు కోల్పోతున్నానని తెలుసుకున్న రేష్మితలో పట్టుదల పెరిగింది. కేవలం చదువు ఒక్కటే తన జీవన గమనాన్ని మారుస్తుందని భావించిన ఆమె అరకొరగా కనిపిస్తున్న కంటికి పది సెంటీమీటర్ల దూరంలో పుస్తకాన్ని ఉంచుకుని అక్షరమక్షరం చదివి ఆకళింపు చేసుకుంది. ఈ నేపథ్యంలో కంటిపై ఒత్తిడి పెరుగుతున్నా.. శస్త్రచికిత్స చేసిన కాలి నొప్పి బాధిస్తున్నా పంటి బిగువనే ఓర్చుకుంది. పట్టుదలతో చదువుకుని మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసింది. ఇటీవల వెలువడిన ఫలితాల్లో తెలుగు-92, హిందీ-64, ఇంగ్లిష్-81, సైన్స్-70, సోషల్-63 మార్కులు వచ్చాయి. అయితే కంటి చూపు సహకరించకపోవడంతో గణితం పరీక్ష సక్రమంగా రాయలేకపోయానని, దీంతో లెక్కల పరీక్ష ఫెయిల్ కావడం తననెంతో బాధించిందంటూ రేష్మిత కన్నీటి పర్యంతమవుతోంది.

కళ్ల మార్పిడితోనే ఫలితం

క్రమంగా కంటి చూపు కోల్పోతున్న రేష్మితను పిలుచుకుని తల్లిదండ్రులు కదిరి, అనంతపురం, బెంగళూరు, తిరుపతి, మదనపల్లి, హైదరాబాద్‌లోని ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా అప్పులు చేసి రూ.2 లక్షల వరకూ ఖర్చు పెట్టారు. డాక్టర్లు ఇచ్చిన మందులు, ఐ డ్రాప్స్ సంవత్సరాలుగా వాడినా ఫలితం దక్కలేదు. రోజురోజుకూ కంటి చూపు తగ్గడం తప్ప ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. ఇక అప్పులు ఇచ్చే వారు కూడా లేకపోవడంతో దిక్కుతోచని తల్లిదండ్రులు తమ కంటి ముందే తారట్లాడుతూ నడుస్తున్న కుమార్తెను చూసి తల్లడిల్లిపోతున్నారు. అయితే కళ్ల (కార్నియా) మార్పిడితోనే రేష్మితకు కంటి చూపువస్తుందని వైద్యులు అంటున్నారు. అయితే 45 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే ఈ చికిత్సకు సంబంధించి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని, రేష్మితకు కళ్ల మార్పిడి చేయాలంటే రూ.2 లక్షలు ఖర్చు వస్తుందని, ఈ మొత్తాన్ని తల్లిదండ్రులే భరించాల్సి ఉంటుందని వైద్యులు తేల్చి చెప్పారు. దీంతో నిరుపేద తల్లిదండ్రులకు దిక్కుతోచలేదు. ప్రస్తుతం సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడంతో వ్యవసాయానికి ఖర్చులు పెరిగి అప్పుల పాలయ్యామని కన్నీటి పర్యంతమవుతున్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి తమ బిడ్డకు కంటి చూపు ప్రసాదించాలని వేడుకుంటున్నారు.

పేరు	పి.ప్రభాకరరెడ్డి
బ్యాంకు పేరు	ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్)
ఖాతా నంబరు	9100 569 5126
ఐఎఫ్ఎస్‌సీ కోడ్	ఏపీజీబీ0001047
ఫోన్ పే నంబర్	97052 12621